క్లుప్తంగా

బత్తులను సత్కరించిన చుండూరి, పాలడుగు



బత్తుల బ్రహ్మానందరెడ్డిని సత్కరిస్తున్న చుండూరి రవిబాబు, పాలడుగు రాజీవ్

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా నియమితులైన బత్తుల బ్రహ్మానందరెడ్డిని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్ గురువారం సన్మానించి అభినందనలు తెలిపారు.

వైవీ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం



చీమకుర్తి ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య

చీమకుర్తి: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పుట్టినరోజు వేడుకలను చీమకుర్తి ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఘనంగా నిర్వహించారు. చీమకుర్తి మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య ఆధ్వర్యంలో రోగులకు, సిబ్బందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రిలోని డాక్టర్లతో పాటు సిబ్బంది, ఎంఆర్‌పీఎస్ నాయకులు మల్లవరపు సాయి, పాటిబండ్ల రవి, యువరాజు, స్థానికులు పాల్గొని వైవీ సుబ్బారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

భక్తుల మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు వన్‌టౌన్: ఇటీవల తిరుపతిలో, బుధవారం సింహాచలంలో భక్తుల మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎం.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేవస్థాన అధికారులు, అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై భక్తులకు భద్రత, వసతులు కల్పించడం లేదన్నారు. ఇటువంటి అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద దేవస్థానాల్లో వీఐపీ భక్తులకు క్షణాల్లో దర్శనాలు ఏర్పాటు చేయడం, సాధారణ భక్తులకు వసతులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. సింహాచలం ఘటనకు దేవదాయ శాఖామంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

9, 10 తరగతుల విద్యార్థులకు శిక్షణ

మద్దిపాడు: ఆసరా సంస్థ ఆధ్వర్యంలో 9, 10 తరగతుల విద్యార్థులకు పెద్దకొత్తపల్లి పంచాయతీ మారెళ్లగుంటపాలెం ఆశ్రమంలో ఇంగ్లిష్, మ్యాథ్స్‌పై సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరు వెంకటేశ్వర్లు క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడారు. దేశ అభివృద్ధికి కీలకం విద్యా విజ్ఞానమని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆసరా అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. 9 10 తరగతుల విద్యార్థులు కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ మాసపత్రిక సంపాదకుడు పొత్తూరు నారాయణ, పెద్దకొత్తపల్లి హైస్కూల్ హెడ్మాస్టర్, ఆసరా ట్రెజరర్ సింగయ్య, రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కార్యదర్శి ఎంసీ వెంకటేశ్వర్లు, ఇంగ్లిష్ మాస్టర్ ఆదినారాయణ, లెక్కల మాస్టర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి...



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

నాగులుప్పలపాడు: వేసవి సెలవుల్లో గ్రంథాలయంలో నిర్వహించే శిక్షణ తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు ప్రసాద్ సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులచే పుస్తక పఠనం చేయించి వారిచే మాట్లాడించారు. కార్యక్రమంలో శిక్షకులు తెలగతోటి శ్యామ్యూల్, శంకరరావు, నాగరాజకుమారి పాల్గొన్నారు.

94.56 శాతం పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు: మండలంలో గురువారం 94.56 శాతం మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. 6,664 మందికిగాను 6,206 మందికి పెన్షన్లు అందించినట్లు వెల్లడించారు. 2,86,43,500 రూపాయలకుగాను 2,67,40,000 రూపాయలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్‌కుమార్, సచివాలయ ప్రతినిధులు నాగార్జునరెడ్డి, ప్రసన్న, నాయకులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన రగల్ జెండా



సీపీఎం కార్యాలయం వద్ద మేడే నిర్వహిస్తున్న నాయకులు



మంచి పుస్తకం వద్ద ఎర్రజెండా ఎగురవేసిన ప్రజా సంఘాలు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న చిట్టిపాటి వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: మేడే వేడుకలను ఒంగోలు నగరంతోపాటు కొత్తపట్నం మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని సుందరయ్య భవన్ వద్ద సీపీఎం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నేత వై.సిద్దయ్య మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను ఇటీవల కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని, దోపిడీకి తలుపులు బార్లా తెరిచేందుకే మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య 112వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, బి.రఘురాం, పి.కల్పన, రమాదేవి, షేక్ అమీర్, రవికుమార్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తిని కాపాడుకోవాలి

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాల నుంచి మేడే స్ఫూర్తిని కాపాడుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్ వద్ద ఎర్రజెండా ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి రక్షణ రంగం, నిఘా వైఫల్యాల కారణంగానే జరిగిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. కార్మిక వర్గాలు, ప్రజలు కలిసి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం నగరంలోని డీమార్ట్, జీజీహెచ్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, నెల్లూరు బస్టాండ్ సెంటర్, అద్దంకి ముఠా కార్మిక సంఘం, ఆర్టీసీ బస్టాండు, బేవరేజెస్ గోడౌన్, ఎలక్ట్రికల్ ముఠా కార్యాలయాల వద్ద మేడే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ముదిపర్తి రాఘవరావు, కె.వెంకటేశ్వర్లు, ఎస్‌డి సర్దార్, ఎంఏ సాలార్, అంజయ్య, సుబ్బారావు, రాజీవ, శ్రీరాం శ్రీనివాసరావు, యు.ప్రకాశరావు, పీకే రాజేశ్వరరావు, ఆదినారాయణ, సుబానీ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

కార్మిక కోడ్‌లను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా ఉద్యోగులు, కార్మికులతో కలిసి నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలోని 45 ప్రదేశాల్లో మేడే నిర్వహించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల శ్రమ శక్తిని దోచుకునేందుకు తెచ్చిన లేబర్ కోడ్‌లను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలు, మహిళా సంఘాల నాయకులు జి.ఆదిలక్ష్మి, మారెళ్ల సుబ్బారావు, టి.విజయమ్మ, కె.సామ్రాజ్యం, ఎస్కే మీరావలి, చిరంజీవి, ఎం బాబు, రాజ్యలక్ష్మి, రాహేలమ్మ, కె.హెమీమా, బి.గోపి, సంజీవయ్య, తంబి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మేడే పండగ కాదు.. స్ఫూర్తి దినం

ఎంతో మంది త్యాగాలతో కార్మిక హక్కులను సాధించుకున్న మేడే అంటే కేవలం పండగ కాదని ఒక స్ఫూర్తి దినమని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మేడేను పురస్కరించుకొని నగరంలోని మర్రి చెట్టు కాలనీ, ప్రగతి కాలనీ, రామనగర్, మాదాల నారాయణ స్వామి భవన్‌లో ఎర్రజెండాలు ఆవిష్కరించారు. మోదీ సర్కార్ ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి.పద్మ, జాలన్న, నారాయణ, రామ్మోహన్, ఎల్.రాజశేఖర్, శ్యాం, అమ్మాజీ, సీతారావమ్మ, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

మంచి పుస్తకం వద్ద..

నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచి పుస్తకం వద్ద మేడే సంబరాలు నిర్వహించారు. పాలక వర్గాలు ప్రజా స్వామిక హక్కులపై దాడులు చేస్తున్నాయని, మేడే స్ఫూర్తితో ప్రజలంతా హక్కుల సాధన కోసం ప్రతిఘటించాలని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ పిలుపునిచ్చారు. కార్మికులు, రైతులు ఐక్య పోరాటాలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు చెప్పారు. కార్యక్రమంలో భీమవరపు సుబ్బారావు, పిన్నిక శ్రీనివాస్, మస్తాన్‌రావు, మొగిలి దేవ ప్రసాద్, పి.పేరయ్య, డాక్టర్ నాగేశ్వరరావు, సుబ్బారావు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట..

నగరంలోని చర్చి సెంటర్‌లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. భీమవరపు సుబ్బారావు, మిరియం అంజిబాబు, వసంతరావు, శేషారెడ్డి, పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ వద్ద..

నగరంలోని జీజీహెచ్ వద్ద యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో యూఎంహెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు జి.నాగేశ్వరరావు, మంత్రునాయక్, బి.వెంకట్, లావన్య తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..

నగరంలోని బండ్లమిట్టలో క్రేన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ కొండూరి విశ్వసేన్ కార్మిక జెండా ఆవిష్కరించారు. ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, దండు అంజిరెడ్డి, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్రోవగుంట సెంట్రల్ వేర్ హౌస్ వద్ద..

నగరంలోని త్రోవగుంట వద్ద గల కేంద్ర గిడ్డంగుల వద్ద సీడబ్ల్యూసీ ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. కార్మికుల హక్కుల కోసం సాగిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మేనేజర్ సందీప్, యూనియన్ అధ్యక్షులు టి.శ్రీనివాస్, రాయపాటి జయరావు తదిరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌తో నష్టం

కొత్తపట్నం: బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఐద్వా జిల్లా నాయకురాలు కె.రమాదేవి విమర్శించారు. మేడే సందర్భంగా కొత్తపట్నంలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ అమల్లోకి వస్తే సంఘాలు పెట్టనివ్వరన్నారు. కార్మికులు సమ్మె చేస్తే జీతాలు కట్ చేయడంతోపాటు ఎస్మా ప్రయోగించి నాయకులను జైల్లో పెడతారని చెప్పారు. సీఐటీయూ మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి, బ్రహ్మయ్య, పి.ఏడుకొండలు, మరియమ్మ, సుజాత, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల ఆధ్వర్యంలో..

ఒంగోలు సబర్బన్: స్థానిక విద్యుత్ భవన్ వద్ద మే డే వేడుకలు విద్యుత్1104 యూనియన్ డిస్కం అధ్యక్షులు రాచగర్ల సంజీవరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండా ఆవిష్కరించిన అనంతరం అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. తదనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అతిథిగా హాజరైన ఒంగోలు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాకినేని హరిబాబు కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏవీ ప్రతాప్, ఒంగోలు డివిజన్ అధ్యక్షుడు వహాబ్ కార్యదర్శి నరసింహరావు, డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోటయ్య, రాంప్రసాద్, హరికృష్ణ, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యాలయంలో

ఒంగోలు సిటీ: ఒంగోలు యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ సీనియర్ నాయకుడు శేషయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి వారి హక్కులను హరించటం సరికాదన్నారు. యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనేతర పనులను నిలిపియాలని, యాప్‌ల భారం తొలగించాలని కోరారు. సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు 8 గంటల పని విధానానికి తూట్లు పొడుస్తూ అధిక శ్రమను దోచుకునే ప్రయత్నంలో ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రభాకర రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కార్మికులు ఉద్యమించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు
- సంతనూతలపాడు నియోజకవర్గంలో ఘనంగా మే డే వేడుకలు

సంతనూతలపాడు: మే డే స్ఫూర్తితో హక్కుల సాధన కోసం కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు పిలుపునిచ్చారు. గురువారం మే డేని పురస్కరించుకుని సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు, పేర్నమిట్ట, సంతనూతలపాడు, మంగమూరు, ఎండ్లూరు గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో కార్మికవర్గం తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు సంపదగా దోచిపెడుతున్నాయని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల అధిపతులు ఎనిమిది గంటల పనిదినాన్ని మార్చి వారానికి 90 గంటలు చేయాలని అంటున్నారని, ప్రభుత్వాలు దానికి తగ్గట్టు కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్స్ తీసుకొస్తూ కార్మికులను నయా బానిసలుగా మార్చడానికి ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మే డే స్ఫూర్తితో కార్మికవర్గం మే 20వ తేదీ నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొని ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా తమ సమస్యల గురించి పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 11 సంవత్సరాల కాలంలో జీతాలు పెంచలేదని, ధరలు మాత్రం రోజురోజుకూ పెంచుతోందని అన్నారు. మరో వైపు పని భారం కూడా పెంచుతోందని విమర్శించారు. మే డే స్ఫూర్తితో సమ్మె కాలపు ఒప్పందాల కోసం, వేతనాల పెంపు కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్, నాయకులు షేక్ నాగు, అద్దంకి భగత్‌సింగ్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నూకతోటి వెంకటేశ్వర్లు, దారా రాఘవులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మద్దిపాడు ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.ధనలక్ష్మి, ఆటో వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కె.ప్రసాదు, పి.శ్రీను, నాయకులు రాఘవ, శ్రీను, రైతు సంఘ నాయకులు కిలారి పెద్దబ్బాయి, అబ్బూరి వెంకటేశ్వర్లు, అన్నం వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలి...

చీమకుర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులంతా ఐక్యంగా పోరాటాలు సాగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా గురువారం చీమకుర్తిలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో కాలం సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినం మే నెల 1వ తేదీని గుర్తుచేసుకుంటూ ప్రతి ఏటా మే డే నిర్వహించుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి 4 లేబర్ కోడ్స్ తీసుకొస్తోందని, కార్మికలోకం ఐక్యంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తొలుత సీఐటీయూలో ఉన్న వివిధ అనుబంధ రంగాల ఆధ్వర్యంలో పలు చోట్ల సీఐటీయు జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఎన్ఎస్‌పీ కాలనీ నుంచి చీమకుర్తి మెయిన్‌రోడ్డు మీదుగా స్టేట్‌బ్యాంక్ వరకు సీఐటీయూ జెండాలతో కార్మికులు ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం మండల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, బీ వీరాంజనేయులు, పూసపాటి వెంకట్రావు, స్థానిక అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



చీమకుర్తి మెయిన్ రోడ్డులో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ కార్మికులు



పేర్నమిట్టలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు, కార్మికులు



నాగులుప్పలపాడు : మే డే జెండా ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు



ఉప్పుగుండూరులో కార్మిక జెండా ఎగురవేస్తున్న సీపీఎం నాయకులు

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మే డే వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు, చదలవాడ, కనపర్తి, ఒమ్మెవరం గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి తూబాటి శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. మండల విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జయంత్‌బాబు, నలతోటి రామారావు, బసవ పున్నయ్య, సుబ్బారావు, పాలపర్తి బాబు, హరిబాబు, ఉన్నం వెంకట్రావు, రమణ కుమార్, భవన నిర్మాణ కార్మికులు, మెకానిక్ వర్కర్లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



చీమకుర్తిలో జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



కొత్తపట్నం బస్టాండ్‌లో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న స్వామిరెడ్డి



యూటీఎఫ్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

స్పెషల్ చీఫ్ సెక్రటరీ విస్తృత పర్యటన



గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద మత్స్యకారులతో మాట్లాడుతున్న కృష్ణబాబు, పక్కన కలెక్టర్ తమీమ్ అన్సారియా

మద్దిపాడు: రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జి, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంటీ కృష్ణబాబు గురువారం మద్దిపాడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని అంజలి గ్రానైట్స్ ఫ్యాక్టరీని సందర్శించారు. గ్రానైట్ ఎగుమతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్దకు చేరుకుని స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. ఇతర ప్రాంతాల వారు వచ్చి ఇక్కడ చేపలు పడుతున్నారని, వారిని పంపించివేయాలని కృష్ణబాబును స్థానిక మత్స్యకారులు కోరారు. రిజర్వాయర్ పరిసరాలలో తాము చేపలు అమ్ముకోవడానికి ఎక్కడా నీడ లేకుండా పోయిందని, అందువలన తమకు షల్టర్ ఏర్పాటు చేస్తే అక్కడే చేపలు అమ్ముకుంటామని తెలిపారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఆయన సూచించారు. అనంతరం మద్దిపాడు పీహెచ్‌సీని సందర్శించారు. ఔట్ పేషంట్ల రిజిస్ట్రేషన్ విధానం, ప్రత్యేక యాప్‌ల గురించి సిబ్బందిని ప్రశ్నించారు. ల్యాబ్‌లో పలు విషయాలను పరిశీలించారు. అనంతరం ఫార్మసీ రూంను సందర్శించి రోగులకు ఇస్తున్న మందులను పరిశీలించారు. ఆన్‌లైన్ చేస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ టి.వెంకటేశ్వర్లు, వైద్యశాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓ డీఎస్‌వీ ప్రసాద్, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కృష్ణబాబు...

నాగులుప్పలపాడు: మండలంలోని కొత్తకోట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను కృష్ణబాబు పంపిణీ చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఆర్‌డీఏ అధికారి నారాయణ, ఏపీ విజయమ్మ, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు హౌసింగ్ బోర్డు కాలనీలో విద్యుత్‌కు అంతరాయం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఒంగోలు నగర విద్యుత్ శాఖ డీఈఈ కేవీ పాండురంగారావు తెలిపారు. 11 కేవీ హౌసింగ్ బోర్డు ఫీడర్‌లో విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల నరికివేత, విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ నుంచి కేఎంఎస్ స్కూల్ వరకు ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని స్పష్టం చేశారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

చీమకుర్తి: చీమకుర్తి వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ధనేకుల రమణయ్య, ఎస్.అంజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఖాదర్‌వలి, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కే బుడిసా, చంద్రమౌళి, షరీఫ్, కోశాధికారిగా గంగాధర్, గౌరవ సలహాదారుడిగా సుభానీని ఎన్నుకున్నారు. నూతన కమిటీతో ఎల్లంపల్లి రంగా ప్రతిజ్ఞ చేయించారు.



వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

8న బహిరంగ వేలం

టంగుటూరు: టంగుటూరు గ్రామ పంచాయతీకి సంబంధించి 36 దుకాణాలు, 13 ఖాళీ స్థలాలకు మార్కెట్ ఫీజుకు ఈ నెల 8న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా పంచాయతీ కార్యాలయంలో వివరాలు తెలుసుకోవాలన్నారు.